
## డిజిట్-మెరిట్



**9,155.97**
కోట్ల రూపాయలు

మిషన్ కాకతీయ పథకం ద్వారా 27,627 చెరువులను పునరుద్ధరించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ఖర్చు.


## థర్డ్ అంపైర్



అందరూ హిస్టరీ క్రియేట్ చేస్తే.. కేసీఆర్ గారు జాగ్రఫీ క్రియేట్ చేశారు.

▪ త్రివిక్రమ్ శ్రీనివాస్, సినీ దర్శకుడు

## థౌజండ్ వాలా..





కౌంట్ డౌన్ 23

హైదరాబాద్ | మంగళవారం 7 నవంబర్ 2023 నమస్తే తెలంగాణ

I

www.ntnews.com


# తెలంగాణ జైత్రయాత్ర 2023




### చెరువులకు మహర్దశ

కాకతీయ రెడ్డి రాజులు పుణ్యం కట్టుకొని 11వ శతాబ్దంలోనే తెలంగాణలో 75వేల గొలుసుకట్టు చెరువులు నిర్మించారు. అదే తెలంగాణకు మేజర్ ఇరిగేషన్. 20 లక్షల ఎకరాలు సాగు అయ్యేది. కానీ, సమైక్య రాష్ట్రంలో.. ఈ సో కాల్డ్ తెలంగాణ కాంగ్రెస్ నాయకులు మౌనంగా ప్రేక్షక పాత్ర వహించడంతో దాదాపు 35 వేల చెరువులు మాయమయ్యాయి. కబ్జాలకు గురయ్యాయి. మిషన్ కాకతీయతో ఆ చెరువులన్నిటినీ పునరుద్ధరించుకున్నాం.

▪ కేసీఆర్

## ఎటమటం !

### వీడ్కోలు కమిటీ



**ఇంతకు** మునుపు ఏ రాష్ట్రంలోనూ లేని పదవిని ఒకటి సృష్టించి, ఈటల రాజేందర్‌ను చేరికల కమిటీకి చైర్మన్‌ను చేసింది బీజేపీ. పార్టీలో మొదటి నుంచి ఉన్న పాత 'కాపుల'ను, ఆ తర్వాత చేరిన నేతలను కాదని ఈటలకు అధిష్ఠానం ఈ పదవిని కట్టబెట్టడం వారికి అసలు మింగుడు పడలేదు. తమతో కనీసం చర్చించకుండా, మాట మాత్రమైనా చెప్పకుండా కమిటీ ఏర్పాటు చేయడం ఏమిటని వారికి ఆగ్రహం కలిగింది. దీంతో తమ తడాఖా ఏంటో చూపించడానికి చేరికల కమిటీకి పోటీగా, వీడ్కోలు కమిటీకి సీక్రెట్‌గా శ్రీకారం చుట్టారు. చేరికల కమిటీని డామినేట్ చేస్తూ వీడ్కోలు కమిటీ చాలా చురుకుగా పని చేసింది. అధిష్ఠానం పెద్దల పట్ల అసంతృప్తిగా ఉన్న నాయకులు అందరినీ సమీకరిస్తూ రోజుకు ఒకరి ఇంట్లో లంచ్, మరొకరి ఇంట్లో డిన్నర్ నిర్వహిస్తూ బాగా వర్క్అవుట్ చేసింది. ఫలితంగా ముఖ్యనేతలు ఒక్కొక్కరుగా పార్టీకి గుడ్ బై చెప్పడానికి క్యూ కట్టారు. మీరు ఏర్పాటు చేసిన చేరికల కమిటీతో పోలిస్తే...మా వీడ్కోలు కమిటీ పని తీరు ఎలా ఉందో చూడండి అంటూ సదరు నేతలు దెప్పిపొడుస్తున్నారు.

• వెల్జాల

## సామాన్యుల మాట



### చదువులమ్మ కోవెల మా గురుకులం

నేను పదో తరగతి దాకా బీబీపేట్‌లోని గురుకుల పాఠశాలలో చదువుకున్నా. ఇప్పుడు ఎడపల్లిలోని ప్రభుత్వ గురుకులంలో ఇంటర్మీడియట్ చేస్తున్నా. గురుకులం లేకపోతే నా పరిస్థితి ఏమయ్యేదో! ఎందుకంటే నేను ఏడేండ్లుగా గురుకులాల్లోనే తింటూ, ఇక్కడే చదువుకుంటున్నా. ఇప్పుడు ఈ గురుకులం లేకపోతే నా చదువు ఆగిపోయేది. మా తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. నన్ను పెద్ద చదువులు చదివించలేని పరిస్థితి వాళ్లది. కేసీఆర్ మాలాంటి పేద పిల్లలు బాగా చదువుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా గురుకులాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ సౌకర్యంతో బాగా చదువుకొని భవిష్యత్తులో ఎంతో ఎదగాలనుకుంటున్నా.

• కె.వందన, తుజాల్‌పూర్, కామారెడ్డి జిల్లా


## ఖుల్లం ఖుల్లా

*జెండా నమ్మి మోసినోళ్ల నెత్తిన 'చెయ్యి' పెడతారు*
*ఆమ్యామ్యాగాళ్లకే పార్టీ పదవులిస్తారు*
*కోవర్టులు డైరెక్టుగ పార్టీనే శాసిస్తారు*
*ప్రజలనేమి చేస్తారు? నిండా ముంచేస్తారు!*

*ఎన్నికలొచ్చినపుడు వీరు మొద్దునిదుర లేస్తారు*
*హడావుడిగా హామీల వర్షం కురిపిస్తారు!*
*'చేతి'లో 'చెయ్యి'వేసి ప్రమాణాలు చేస్తారు*
*చివరికి ఏం చేస్తారు? 'చేతు'లెత్తేస్తారు!!*

... దండమూడి శ్రీచరణ్

నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ



# ఇండియాకు ఇండస్ట్రీ హబ్ తెలంగాణ

కిటెక్స్ గార్మెంట్స్ లిమిటెడ్ ఎండీ సాబూ ఎం.జాకబ్

కొత్తగా రెక్కలు తొడిగిన రాష్ట్రం తెలంగాణ. కానీ, ఇక్కడికి పారిశ్రామికవేత్తలు రెక్కలు కట్టుకొని వాలిపోతున్నారు ఎందుకు? రాష్ట్రంలోని పరిస్థితులను చూసిపోదామని వచ్చిన బిజినెస్‌మ్యాన్‌లు, ఇన్వెస్టర్‌లుగా మారిపోతున్న కారణాలేమిటి? అన్న ప్రశ్నలకు కిటెక్స్ గార్మెంట్స్ లిమిటెడ్ ఎండీ సాబూ ఎం.జాకబ్ విస్పష్ట సమాధానం ఇచ్చారు.

'మా పరిశ్రమ నెలకొల్పడానికి ఇక్కడి పరిస్థితులను అంచనా వేసే ఉద్దేశంతో వచ్చిన నేను, ఫ్లైట్ దిగిన ఆరు గంటల్లోనే పెట్టుబడి పెట్టాలన్న నిశ్చితాభిప్రాయానికి వచ్చాను. అందుకు కారణం తెలంగాణ ప్రభుత్వ విధానమే. కేసీఆర్ నాయకత్వం, కేటీఆర్ మంత్రిత్వం తెలంగాణ బలాలు. ఇక్కడి సుస్థిర ప్రభుత్వం, స్పష్టమైన విధాన నిర్ణయాలు... పెట్టుబడుల కోసం వచ్చే పారిశ్రామికవేత్తలకు వరాలు. రాష్ట్రంలో ఉపాధి కల్పన గురించి తపన కలిగిన తెలంగాణ నాయకత్వం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది' అని చెబుతున్నారాయన.

### 12 రాష్ట్రాలు చూసిన తర్వాతే ఇక్కడికి వచ్చాం



- సుస్థిర ప్రభుత్వం తెలంగాణ బలం
- కేసీఆర్ ప్రభుత్వ విధానం భేష్
- కేటీఆర్‌లో ప్రొఫెషనలిజం చూశాను
- రాష్ట్రంలో పారిశ్రామికరంగం పరుగులు
- వచ్చే ఏడాది కల్లా 50వేల మందికి ఉద్యోగాలు

### • యూఎస్‌కు ఎగుమతి

**మా** ఉత్పత్తులు వంద శాతం యూఎస్ మార్కెట్‌కు ఎగుమతి అవుతాయి. సుమారు రూ.4,000 కోట్ల విదేశీ మారక ద్రవ్యం మన రాష్ట్రానికి వస్తుంది. ఈ మొత్తం తెలంగాణలోనే ఖర్చవుతుంది. వరంగల్‌లో మేము పరిశ్రమ ప్రారంభించిన తరువాత అక్కడికి పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. మరో ఆరు నెలల్లో అక్కడ స్థలం దొరకడం కూడా కష్టం. మరో విషయం, ఇతర రాష్ట్రాల్లో అధికారుల నుంచి కూడా సమస్యలు ఉత్పన్నం అవుతుంటాయి. ఇక్కడ ఆ ఇబ్బందీ లేదు. నాయకత్వం బలహీనంగా ఉంటే అధికారుల డామినేషన్ ఉంటుంది. ఇక్కడ ఆ పరిస్థితి లేదు.

### • తక్షణ స్పందన

**ఇతర** రాష్ట్రాల్లో పాలకులు ఏదో ఫార్మాలిటీ కోసం మాత్రమే పారిశ్రామికరంగాన్ని ప్రోత్సహిస్తారు తప్ప వారిలో చిత్తశుద్ధి ఉండదు. ప్రారంభోత్సవాలకు వచ్చి వెళ్లిపోతారు. ఇక్కడ అలా కాదు! ఏదైనా సమస్య ఉండి కేటీఆర్‌కు వాట్సాప్ మెసేజ్ పెడితే.. రెండు, మూడు నిమిషాల్లో స్పందన వస్తుంది. దీన్ని బట్టి పారిశ్రామికరంగం పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధి ఎటువంటిదో అర్థం చేసుకోవచ్చు.

తెలంగాణలో రూ.3,000 కోట్ల పెట్టుబడితో 50వేల ఉద్యోగాలు సృష్టించాలనే సంకల్పంతో కిటెక్స్ సంస్థ రెండు టెక్స్‌టైల్ పరిశ్రమలను నెలకొల్పుతున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పారిశ్రామికరంగం, ప్రభుత్వ విధానాలు, ఇతర రాష్ట్రాల్లో పరిస్థితులపై సాబూ ఎం.జాకబ్‌తో 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూ...

... కిశోర్ శుక్లా





**దాదాపు 55 ఏండ్ల వ్యాపార చరిత్ర మీది. తెలంగాణలో కొత్త ప్రస్థానం ఎలా మొదలైందో చెబుతారా?**

**1968లో** కేరళలో కిటెక్స్ సంస్థను ప్రారంభించాం. టెక్స్‌టైల్, కుకింగ్, స్పైసెస్, అప్పెరల్, అల్యూమినియం, స్కూల్‌బ్యాగ్స్ తదితర వస్తువులు ఉత్పత్తి చేస్తున్నాం. దాదాపు 15,000 మంది ప్రత్యక్ష ఉపాధి పొందుతున్నారు. కేరళలో రాజకీయ పరిస్థితులు అంత బాగాలేవు. చాలా కంపెనీలు ఆ రాష్ట్రం నుంచి తరలిపోతున్నాయి. నేనూ మా సంస్థను అక్కడి నుంచి తరలించాలని భావిస్తుండగా శ్రీలంక నుంచి ఆహ్వానం అందింది. ఢిల్లీ, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్ ఇలా దాదాపు 12 రాష్ట్రాల నుంచి పిలుపులు అందాయి. అదే సమయంలో తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఫోన్ చేశారు. అయితే, అందరి మాటల్లో, కేటీఆర్ పలకరింపులో ఎంతో వ్యత్యాసం ఉందనిపించింది. అందరూ మా రాష్ట్రంలో పెట్టుబడి పెట్టండి అన్నారు. కేటీఆర్ మాత్రం.. 'ఒకసారి మా రాష్ట్రానికి రండి, చూడండి' అన్నారు. కొవిడ్ సమయం కావడంతో 'రావడం ఎలా?' అని సందేహాన్ని వెలిబుచ్చాను. 'ప్రైవేట్ జెట్ పంపిస్తాను' అన్నారాయన. నేను షాకయ్యా! 'మీరు సీరియస్‌గానే అంటున్నారా?' అని అడిగా! 'అవును! మీరు 24 గంటల్లోగా కన్‌ఫర్మ్ చేస్తే.. నేను ఫ్లైట్ ఏర్పాటు చేస్తాను' అన్నారు. చాలావండర్ అనిపించింది. ఆయన మాటతీరు అడ్మైర్ చేసింది. తెల్లారేసరికల్లా, నేను ఓకే చెప్పడం.. వెంటనే ఫ్లైట్ పంపడం జరిగిపోయాయి.

**తెలంగాణకు వచ్చాక, ఇక్కడ మిమ్మల్ని ఆకర్షించిన అంశం ఏమిటి?**

**కేటీఆర్** ఆహ్వానంతో మరుసటి రోజే తెలంగాణకు చేరుకున్నాను. కేటీఆర్ మాత్రం నా రాక కోసం ఎదురుచూస్తుండటం ఆశ్చర్యం కలిగించింది. నేను వివిధ రాష్ట్రాల్లో, జాతీయస్థాయిలో చాలామంది నాయకులను చూశాను. కానీ, ఇంత పంక్చువల్ లీడర్‌ని చూడలేదు. కేటీఆర్‌తో సమావేశమైన తర్వాత వివిధ అంశాలపై ఆయన స్పందించిన తీరు ఎంతో ఆకట్టుకున్నది. ఆయన ఒక పొలిటికల్ లీడర్ కన్నా.. ప్రొఫెషనల్ పర్సన్ అనిపించింది. నేను చాలా ఏండ్లుగా కేరళ ముఖ్యమంత్రులు, వివిధ నాయకులతో మాట్లాడా! ఒక సంస్థ బలోపేతం అయితే కలిగే ఉద్యోగ అవకాశాలు, రాష్ట్రానికి లభించే ప్రయోజనం ఏంటో వారికి అర్థమైనట్టు అనిపించలేదు. కానీ, కేటీఆర్ వీటన్నిటినీ అర్థం చేసుకున్నారు. చాలా ప్రొయాక్టివ్‌గా ఉంటారు. మనం ఏది అడిగినా వెంటనే సమాధానమివ్వగలరు. సమస్యకు పరిష్కారమూ చూపగలరు.

**పెట్టుబడి పెట్టాలన్న ఆలోచనతోనే తెలంగాణలో అడుగుపెట్టారా?**

**లేదు లేదు!** అప్పటికింకా పెట్టుబడిపై ఎలాంటి నిర్ధారణకూ రాలేదు. ఎందుకంటే, రాష్ట్రంలో పరిస్థితులు నాకు తెలియదు. కానీ, ఇక్కడికి వచ్చాక, కేటీఆర్‌తో మాట్లాడాక తెలంగాణలో ఇన్వెస్ట్ చేస్తే సురక్షితంగా ఉంటుందని అర్థమైంది. కేటీఆర్‌తో భేటీ అయ్యాక సైట్ చూసేందుకు వరంగల్‌కు వెళ్లాం. అధికారులు చాలా పాజిటివ్‌గా సహకరించారు. అదేరోజు రాత్రి వెయ్యి కోట్ల పెట్టుబడితో టెక్స్‌టైల్ అప్పెరల్ పరిశ్రమ నెలకొల్పుతామని ప్రకటించాను. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఎంత నమ్మకం ఉంటే ఈ ప్రకటన చేసి ఉంటానో అర్థం చేసుకోవచ్చు. కేటీఆర్ స్పందించిన తీరు, ఆయన మాకు కలిగించిన నమ్మకం వల్లే ఆరు గంటల్లోనే భారీ పెట్టుబడికి ముందుకొచ్చాం. ఒకరోజు పర్యటన కోసమే ఇక్కడికి వచ్చిన నేను ఈ ప్రభుత్వంపై నమ్మకం కుదరడంతో నా ప్రయాణాన్ని ఒక రోజు వాయిదా వేసుకున్నా. మర్నాడు హైదరాబాద్ చుట్టూ మరికొన్ని పారిశ్రామికవాడలు సందర్శించాను. ఇందులో భాగంగా సీతారాంపూర్‌కు కూడా వెళ్లాను. వరంగల్‌తోపాటు సీతారాంపూర్‌లోనూ ఇన్వెస్ట్ చేయాలని నిశ్చయించుకున్నాను. రెండుచోట్లా కలిపి రూ.3,000 కోట్లు ఇన్వెస్ట్ చేయాలని సంస్థ నిర్ణయించింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా 50,000 ఉద్యోగావకాశాలు కల్పించాలని భావించాం. ఉద్యోగుల్లో 80 శాతం మహిళలే ఉంటారు. ఈ రెండు పరిశ్రమల్లో కలిపి రోజుకు 22 లక్షల దుస్తులు తయారు చేయనున్నాం.

### ▪ మాటంటే మాటే..

అమెరికాలో కూడా రాష్ట్రాల మధ్య పోటీ ఉంటుంది. వారు కూడా పెట్టుబడిదారులను ఆహ్వానిస్తారు. భారత్‌లో రాష్ట్రాల మధ్య చాలా పోటీ ఉంది. అయితే, చాలా రాష్ట్రాలు చేసిన వాగ్దానాలు నెరవేర్చడంలో విఫలమవుతాయి. ఉత్తుత్తి వాగ్దానాలతో ఒకటీ, రెండూ పరిశ్రమలు వస్తాయేమో కానీ, వ్యాప్తి ఉండదు. అందుకే, పెట్టుబడులను ఆకర్షించడంలో అవి విఫలమవుతున్నాయి. తెలంగాణలో ఆ పరిస్థితిలేదు. ఇక్కడ మాటంటే మాటే! మరోవిషయం, ఒకసారి ఇన్వెస్ట్ చేసిన తర్వాత దాన్ని వెనక్కి తీసుకోవడం కుదరదు. అందుకే, పెట్టుబడి పెట్టేముందు చాలా ఆలోచించి నమ్మకం కుదిరాకే ముందుకొస్తారు.

**పరిశ్రమ నిర్మాణం చాలా వేగంగా సాగుతున్నది. ఉత్పత్తి ఎప్పుడు ప్రారంభమవుతుంది?**

**వరంగల్** ప్లాంట్ నిర్మాణం పూర్తయ్యింది. ఈ ఏడాది డిసెంబర్‌లో ఉద్యోగుల నియామకం చేపట్టనున్నాం. రానున్న జనవరిలో మిషినరీ వస్తుంది. మార్చిలోగా ఉత్పత్తి ప్రారంభమవుతుంది. సీతారాంపూర్‌లో 2024 డిసెంబర్ కల్లా ఉత్పత్తి మొదలు పెడతాం. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఈ టెక్స్‌టైల్ పరిశ్రమలు నెలకొల్పుతున్నాం. సీతారాంపూర్‌లో భారీ బిల్డింగ్ నిర్మిస్తున్నాం. ప్రపంచ తయారీ పరిశ్రమల్లో ఇది అతి పొడవైన భవనం అవుతుంది. ఒక భవనం పొడవు 1,350మీటర్లు ఉంటుంది. ఇటువంటివి మూడు భవనాలు ఉంటాయి. అన్నీ కలిపితే నాలుగు కిలోమీటర్ల పొడవుంటాయి. ఇది ప్రపంచం మొత్తంలోనే అతి పొడవైన మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ అవుతుంది. ప్రస్తుతం అమెరికా టెక్సాస్‌లో టెస్లా భవనం పొడవు 1,160మీటర్లు. దానికన్నా సుమారు 190మీటర్లు ఎక్కువ పొడవున్న భవనం మేం నిర్మిస్తున్నాం. ఈ నిర్మాణం గిన్నిస్ రికార్డ్ కాబోతున్నది.


మిగతా 3వ పేజీలో..